# ముడిసరుకు

సూర్యచంద్రాదుల సాచ్చిగా... సురలు ముక్కోటి దేవతల సాచ్చిగా ఆకాశవేణి సాచ్చిగా బూదేవి సాచ్చిగా కడాన మాయమ్మ సాచ్చిగా రేత్రి నాకు నిద్ర పట్లా!

ఎప్పుడన్నా మాబాశాలి–

''ఏమి కర్మో నా కర్మ. రేత్రంతా ఎంత సతపోరినా నిద్దరే పట్లా!'' అని వగస్తా ఉంటే ''ఒళ్లు అల్సిపోతే గదంటే వొళ్లుమర్సి నిద్ర పట్టేదానికి!'' అంటా యాసణ్ణం పడ్తా ఉంటి. అటుమంటిది ఈపొద్దు నాగెతి కూడా ఆడికే తెల్లారే కుందికి నిద్దర పట్టేదానికి వొళ్లలుపు వొగిటే కారణం కాదని తెలస్తా ఉండాది.

తనదాకా వచ్చినప్పుడే కదా మణిసి తడువుకుండేది!

బూములు బావులు కావాల. మిద్దెలు మేడలు కావాల. కార్లూ షికార్లూ కావాల. యాడిదీ నాకే కావాల. అని అల్లాడ్తా పొల్లాడ్తా ఆశే ఊపిరిగా బతికే వాళ్లకైతే ఎట్లా నిద్దర పట్టదు. అదే! నాబోటోడికి ఏమి ఉండాది? ఉండాదని లే. లేదని లే. ఉణ్ణికాడికి మట్టసంగా పట్టుకత్తరించినట్లు గుట్టుగా కాపరం చేసుకుంటా ఉండే బతుకు. ఈ బతుకులో గూడా నిద్దర పట్టలేదంటే ఎవురైనా నమ్మతారా?

కడుపు చింపి చూపిస్తే గారడీ అనుకుండే ఈ దినాల్లో నిద్దర పట్లేదని చెప్పేదానికి కూడా యిందురి మింద సత్తెలు బాసాలు చెయ్యాల్సి వచ్చింది.

నీడనే నమ్మని యీ కాలంలో మణుసులు నిజం చెప్తే మాత్రం నమ్మతారా? అయినా–

''అయ్యయ్యో! అరెరెరె! ఒగిటి అనుకుంటే వొగిటైపాయనే. ముక్కెమంత్రిని నిలేద్దామనుకుంటే ఆ మొనగాడు నడిరోడ్లోనే పడకసీను ఏసేసెనే? ప్రెజలు ఏమనుకుంటా ఉండారో ఏంపాడో!'' అని రాయలసీమ నాయకులకు నిద్దర పట్లేదంటే నమ్మచ్చు.

''ఫ్రంట్‌ను పట్టుకోని అట్టాట్ట పైకి డిల్లీ దాకా పోదా మనుకుంటే రాయలసీమలో రాళ్లకు యిప్పుడనంగానే పాణం రావాల్నా?'' అని దిగులు పడే ముక్కెమంత్రికి నిద్దర పట్లేదంటే నిజిమనుకోవచ్చు.

''ఈడీ! సింగ్‌గాడు యిర్సక పడ్తా ఉండేది చూస్తా వుంటే అట్టపాయ్ యిట్టపాయ్ కడాన వాడు నాకే ఊనం తెచ్చేటట్టుగా ఉండాదే?'' అని రాజీవ్‌గాంధీకి నిద్దర పట్లేదని గాలి పోవిడిగా తెల్సినా కాంగ్రెసోళ్ళందురికీ కంటి మింద రెప్ప పడలేదంటే నమ్మచ్చు.

''ఇందిరా గాందీ చావునే గాదు. ఆమె నేల కొరిగిన చోటును గూడా చరిత్రలే కెక్కించి ఆడ పూలదండ లేసి దండాలు పెట్తా ఉండారు గదా? మా మామ ముక్కెమంత్రి. రాముడుగా కిష్టుడుగా సిల్మారాజ్జిమేలిన మొగలాయి. అట్టాంటి మహన్నబావుడు నడిరోడ్లో నేలను పవ్వళించె గదా? పరుపులు లేకుండానా? పట్టిమంచాలు లేకుండానా? ఎవురి కోసరం పొణుకుండె? ఈ ప్రెజల కోసరం! అటుమంటప్పుడు ఆ చోటును ఏం చేస్తే అదొక పుణ్ణె బూమిగా నిలబడి పోతింది.'' అని అల్లుళ్లు యిద్దురు పోటా పోటీగా ఆలోచిస్తా నిద్దర పట్లేదంటే నమ్మచ్చు.

పైకి పోవాల్సిన రాకెట్టు రేసులో ఎనిక్కి తిరుక్కుణ్ణె గుర్రం మాదిర్తో పాయ్ పాయ్ సముద్రంలో దూకితే దాంతో గూడా దూక లేకుండా శీహరి కోట్లో శానా మందికి నిద్దర పట్లేదంటే నమ్మచ్చు.

ఈ దేశింలో ఒక సన్నోడు అసలు ఆలోచించ గూడదు. అదవా ఏ యదవన్నా ఆలోచించినా యిట్టా మాదిర యింతింత పెద్ద పెద్ద యిసయాల్ను గురించి ఆలోచించేది నేరం. ఇటుమంటి నేరం చేస్తే పోలీస్ టేసిన్లోకి తోసి ముక్కెలిరగ దన్నచ్చు. ఆణ్ణుంచి అట్టట్నే మటుమాయం చేసి పారెయ్యచ్చు. పోనీలే అని దయ తలిస్తే కేసు పెట్టచ్చు. పదారు కమ్ముల ఎనక్కు తొయ్యచ్చు. అదికారం వాళ్ల శాతల్లో ఉండాది. కారాల్లోకెల్లా ఏకారం గొప్పదంటే అదికారం గొప్పదని అప్పుడెప్పుడో పోతులూరాయన సెలవిచ్చినాడు. మొనగోళ్లు ఆడ్తా వుండారు. ఆడనీ! ఆడనీ! పొంగేదంతా పొయ్యి పాలే అన్నెట్టుగా పొంగనీ! ఈ ప్రెజలు పొంగిన నాటికి పొంగేదో మింగేదో కుంగేదో వాళ్లే తెల్సుకుంటారు.

ఇద్దో యిట్టా నా బతుకు. నిద్దర పట్లేదంటానే ప్రెజల్ను నిద్దర లేపే కాడికొచ్చేసినా. దీన్ని ఏమంటా రంటే? – ఊరు చూడమంటే ఉత్తరం చూసేబుద్ది! అంటారు.

సరే! ఉడుం కెందుకు ఊళ్లో పెత్తనం అన్నెట్టుగా పెద్ద పెద్దోళ్ల కతలు ఆడికి యిడ్సి పెట్టేసి సన్నా బన్నా కాడికొస్తే వాళ్ల బతుకులు వాళ్లకు ఉండాయి. ఎంత చెట్టుకు అంత గాలి అన్నెట్టుగా ఆ బతుకులకు తగిన ఎతలు కతలు ఉండనే వుంటాయి!

ఈ సంసారాన్ని ఎట్టా యీద బోతాన్రా బగమంతుడా? అని ఒకడికి నిద్దర పట్టకుండా పోతే ఒక సంసారి అయ్యేదెప్పుడో అని యింకొకడికి నిద్దర పట్టదు.

అప్పు తీసుకున్నోడు ఎగరేసిపోతే యిచ్చినోడికి నిద్దర పట్టదు.

ఎంత గిరం సెన్నా అప్పుపుట్నోడికి అసలు నిద్దరేరాదు.

పూట ఎట్టా గడవ బోతిందబ్బా? అని వొకడికి నిద్దర పట్టకుండా పోతే పూట ఎట్టా గడిపితే బాగుంటుందని వొకడికి నిద్దర పట్టదు.

ఊసిపాయ్‌న ఎంటికలుండే అమ్మకు ఉండే అమ్మను చూస్తే ఆ రాత్రి కింక జాగారమే!

దినమ్ము మందు కొట్టేవాడు ఒక్క దినం కొట్టకుండా పోతే నిద్దర పట్టదు.

ఇంట్లో బాశాలి కుశాల మింద ఉణ్ణా నిద్దర పట్టదు. కారాలు మిరాలు నూర్తా ఉణ్ణా కంటి మింద రెప్ప పడదు.

ఇట్టా మాదిర నిద్దర పట్టకుండా పొయ్యే దానికి సవాలచ్చ కారణాలు!

అన్నెట్టు అన్నిటి కంటే ముక్కెం మన పండగలు. ఈ పండగలుండాయే అవ్వి ఎచ్చులమారి బతుకుల్లో తలకుచ్చులు. పండగ వస్తా ఉండాదంటే కొందుర్ని పట్టేదానికి పగ్గాలుండవు. కొందురుకి ఎట్టబ్బా ఈ పండగ గడవ బోతిందనుకుంటే నిద్దరే పట్టదు. ఎదిరింటోడికి ఎరిసి పక్కింటోడికి జడిసి కొంపలో ఎల్లవగట్నే పిలకాయిలు రంపులో తడిసి ఈ సంగానికి సాంప్రదాయానికి రుణపడి ఆ పండగను ఎట్నో ఒకట్టా అయిందనిపించేస్తే దాని పాటికది పోతింది. ఈ పండగలు చెప్పి చెప్పి వచ్చి వొరగ బెట్టిందీలే. చెప్పకుండా చెక్కేస్తే కొంపలు మునిగి పాయిందీలే.

అసలు నిద్దర పట్నోడు పడక మిందనే పొణుకోని అట్ట పొల్తాడు. ఇట్ట పొల్తాడు. పక్కనుండే వాళ్లపైన కాలేస్తాడు. చెయ్యేస్తాడు. ఎవురూ లేకుండాపోతే దిండెత్తుకోని కర్సుకుంటాడు. ఇంకెవుడైనా తెలివి మంతుడైతే లేచి కూసోని చదువుకుంటాడు. అంతేగానీ యిట్టా మాదిర నిద్దర ఎవురెవురికి పట్టదు! ఎందుకు పట్టదు? అని జుట్టు పీక్కుంటా సున్నంలో సూక్ష్మం ఎతకతా కూసోడు.

నిజింగా నేనొక ఎరిముండ. రేత్రినాకు నిద్దర పట్లేదంటే ఎందుకు పట్లేదని చెప్తే సరిపోలా? దానికే యింత సేపు నిద్దర్తో ముద్దూ ముచ్చట్లు ఆడుకుణ్ణెట్టు సోదె ఎలబోసు కోవాల్నా? నిద్దరపట్నోడు బుద్ధిలేనోడు యిద్దురూ వొగిటే. వాళ్ల బుద్ధులు ఎట్టెట్ట పోతాయో వాళ్లకే తెల్దు!

రేత్రి నాకు నిద్దర పట్లేదంటి గదా? అసలు పాయ్ పొణుకోనుంటే గదా నిద్దర పట్లేదని చెప్పేదానికి! జాము రేత్తిరి కాడ అంత ఎంగిలి పణ్ణా. పాయ్ పొణుకుందామని మిద్దె పైకెక్కినా. ఆడ నిలబడుకోని యీదిలో కల్లా చూసినా. ఆడ నుంచి కాలు కదిలుంటే వొట్టు!

మూడు దినాల నుంచి పట్నె ముసురు యింకా యిడ్సి పెట్లా. ఆ పొద్దు ఎట్నో ఏమో గానీ మున్సి పాల్టీ లైట్లన్నీ రెట్లావు వత్తులేసి ముట్టించిన దీపాల మాదిర్తో ఎలిగి పోతా ఉండాయి. ఈదంతా ఎన్నెల అర బోసినట్టుండాది. తెల్ల దుప్పిట్తో ఆకాశిం ముసుగేసు కుణ్ణింది.

ఉత్తరాన ఉండే కొండలు ఆకాశింతో కల్సిపాయ్ నట్టుండాయి. ఆ కొండల్లో తిరమల కొండకు పొయ్యే కాలి దోవలో సోలుపుగా ఎలిగే దీపాలు ఉట్టికీ సొర్గానికీ కూడా కాకుండా నడ మంత్రాన నిలబడిపాయ్న నచ్చిత్రాల సోలుపు మాదిరుండాయి. చలికి కోడిపెట్ట ముడుక్కుణ్ణెట్టు ఊరు ముడుక్కోని ఉండాది. ఆకు అల్లాళ్లా. జడివాన సడి మాత్రం సిటపట మంటా ఉండాది– అప్పుడప్పుడు రేగితే మా బాశాలి మాదిర!

జాము రేత్తిర్లో ఆ జడివానలో ఆ చలిలో యీదిలో పది పన్నెండు మంది గసపోస్తా ఉండారు. మిద్ది మింద నిలబడుకోనుంటే గూడా ఆ గస గుండెల్ను ఎచ్చంగా తాకినట్టుండాది. రోడ్డు వారంటే తొవ్విన కాలవ బారడు యడం ఒక్కటిన్నర బార లోతు ఉంటింది. ఆ కాలవలోకి సుమారుగా బొట్టంత లావుండే సిమింటు పైపుల్ను తోసి ఒక దాంతో వొగిటి జాయింటు చేస్తా ఉండారు. టెలిపోను కేబిల్సును ఆ పైపుల గుండా తీసుకోని పోబోతారంట. తెల్లారే కాడికి ఆ పని అయిపోవాల. లేకుండా పోతే ఆ యీదిలో అవ్వి వచ్చే పొయ్యే వాళ్లకు అడ్డం. అందుకని తెల్లవాదులు పని చేస్తానే ఉండారు.

ఆ యాళకాడ ఒకర్నొకరు ఎచ్చంగా కావిలించుకోని పొణుకుండే వాళ్లుండారు. అర్సేతి మందం దుప్పట్లు కప్పుకుణ్ణా సందు చూసుకోని దూర్తా ఉండే చలికి తట్టుకోలేకుండా గుంజు లాడు కుంటా ఉంటే వాళ్లుండారు. గళాసులు ముందర పెట్టుకోని వొళ్లు ఎచ్చ చేసుకుండే మత్తేబులుండారు. అయితే యీళ్లు మాత్రం ఆ చల్లో గూడా చెమట గార్తావుంటే ఆ చెమట వాన నీళ్లతో కల్సి జార్తా వుంటే అదేమీ లెక్క చెయ్లా. వాళ్లేమో వాళ్ల పనేమో!

వాళ్లకల్లా చూస్తా చూస్తా ఉండంగానే నా మణుసు ఆ కాలవ తొవ్వినోళ్ల కల్లా మల్లె. ఆ పొద్దు తెల్లార్నుంచి సందేళ దాకా యింట్లోకి ఆ కాలవ దాటుకోని వస్తావుంటే మా యింటి ముందర కాలవ తొవ్విన యిద్దురు ఆడోళ్లు కండ్ల ముందర మెదల్తానే ఉండారు. తల్లీ బిడ్డ మాదిరుండారు. తల్లికి నలబైకి పైబడి ఉంటింది. ఆ బిడ్డకు పదారేండ్లకు అట్నో యిట్నోగా ఉంటింది. ఆ పాప రొండు చేతుల్తో సమ్మెట్నీ పైకెత్తి సెగితి కుందికి కొట్తా వుండాది. సిమింటు అరడుగు మందాన ఉండాది. దెబ్బ మింద దెబ్బ పడ్తా వుణ్ణా కదలకుండా మోరకించుకుణ్ణె దున్నపోతు మాదిర్తో ఆ రోడ్డు కొట్టు చూద్దాం అంటా వుండాది. అయినా ఆ బిడ్డ యిడ్సి పెట్లేదే? సందేళ కాడ ఒక్క సెణం అట్టా కూసోకుండా కొట్తానే ఉండాది. ఇంక నా వల్ల కాదు. ఈ దెబ్బలు తినే దానికన్నెట్టుగా సిమింటు రోడ్డు వొప్పు లొప్పులుగా పగల్తా ఉండాది. తల్లి గెడ్డ పార్తో తొవ్వి మట్టిని పార్తో ఎత్తెత్తి కాలవకు యీ పక్క ఆపక్క పోస్తావుండాది. సందేళకు ఆమె అట్లా ఎత్తి పోసిన మట్టి ఉరామరిగ్గా ఒక లారీకి అయితింది.

అంటే ఎన్ని పార్ల మట్టి అయితే ఒక లారీకి అయితింది? ఒక్కొక్క పారగా ఎత్తేస్తే ఎన్ని పార్లు వొంగిలేసి ఉండాల?

వాళ్ల వొంటి మింద పలం కండలేదు. లెక్కబెట్ట మన్నెట్లు ఎమికలు పొడ్సుకోని వచ్చుండాయి. ఆ వొంటికి చుట్టుకోనుండే గుడ్డ ఆడికందలా? ఈడికి చాల్లా? అయినా వాళ్లు వొంగి లేస్తావుంటే ఎదురు సివ్వలు వొంగి లేచినట్టుండాది. అంత కష్టం చేస్తా ఉండారా? కట్టుకోను గుడ్డ ఎట్లన్నా కాలి పోనీ! కడుపుకు కూడు?

మద్దేణ్ణం కాడ మా యింటి ముందర కూసోని మా బాశాల్ని అడిగి చెంబుతో రోన్ని మంచినీళ్లు తీసుకోని వాళ్లు తినింది తిండా? సత్తు గిన్నె ముందర పెట్టుకోని ఆగిన్నిలో కుడిచేత్తో దేవుకుంటా పిడ్సిపిడ్సి పిడ్సచేసిన ఉప్పుసప్పిడి మెతుకుల్ని ఎడమచేతి అరచేతిలో పెట్టుకోని ఒక ఎండుమిరపకాయి కొరుక్కుంటా!...

తల్సుకుంటా ఉంటే యిప్పుడు గిర్రని కండ్లలో నీళ్లతిరగతా ఉండాయ్.

నరనరము చినగతా ఉండాది. చెమట బొట్లుబొట్లుగా కార్తా ఉండాది. ఆకు చుట్టారా అరవైయారు కూరల్తో కాకుండా పాయ్‌నా అంత కూడూ కూరతో నాలుగేళ్ళ లోపలికి పోనంటా ఉండాయ్. ఎవుడికి కాబట్టింది!

రోడ్లో నడ్సేదానికి లేకుండా చేస్తావుండారని కసురుకుంటా యిసురుకుంటా నడ్సే జనం నడస్తానే ఉండారు.

వచ్చేవాళ్లకు ఎట్టొచ్చి పడిపోతా ఉండాదో ఒంటికి సెగబ్బా తగలకుండా ఒక్క మోపన వచ్చి పడిపోతా ఉండాది. తినితినీ అట్టాహాట్టా వొగిటిగానే బల్సిపోతా ఉంటే అడుగెత్తి పెట్టే దానికి అల్సిపుల్సి పోతా ఉండారు.

ఈళ్లూ మణుసులే! వాళ్లూ మణుసులే! ఎందుకీ వెత్తాసం అంటే–

అందురూ పల్లకెక్కే వాళ్లే అయితే మోసే వాళ్లెవరని అడగతారు కొందురు మహన్నబావులు. ఎల్లకాలం వాళ్లే మొయ్యాల్నా అంటే– వాళ్లు చేసుకుణ్ణె కర్మకు ఎవురు బాద్దులంటారు.

అసలీ రాయలసీమలో పుట్నోళ్లే కర్మచేసుకోని పుట్నోళ్లేమో?

చేసేదానికి సెగితుండాది. దున్నుకుండే దానికి జానడో బిత్తిడో కయ్యలుండాయి.

అయినా నీళ్లేడుండాయి?

ఆకాశిగంగ అంటేనా దింపుడుగళ్లం ఆశ చూపిస్తా ఉండాది. పాతాళగంగను పట్టుకుందామంటే పట్టు దొరకనంటా ఉండాది.

ఇంక యాడబోయ్ చావాల. అందుకే పల్లెల్లో బతకలేకుండా ఎలబారొచ్చేది. ఈ టవన్లల్లో ఈడా ఆడా యిద్దో యిట్టా రెక్కలు ముక్కలు చేసుకుండేది. చాలీ చాలని తిండీ... చచ్చీ చావని బతుకుల్ను మల్లా వానలొచ్చేదాకా అట్టా ఎలనీదుకుండేది.

చినుకు నేలపడే కుందికి మల్లా ఆశ చిగిరిస్తింది. అంతో యింతో ఉండే వాడు సాగు చేసుకుందామని ఎలబారి పోతాడు. కూలి బతుకుల కేముండాది. యాడైనా కూలి చేస్తేనే గదా కుండ కాలేదని యాణ్ణే కుదురు కుంటారు. ఇంక పల్లెలో రైతుకు కూలోడు కావాలంటే వాడిదే వాడు కుడ్సినంత పని!

రాయలసీమలో రైతు రొంటికీ చెడిన రేవడైపోతా ఉండాడు.

ఈ చేతులేనా అంగళ్లల్లో కూసోని రత్నాలమ్మింది? ఈ చేతులేనా కరువుకాటకాల్లో వలస వచ్చినవాళ్ల కంత పెట్టి వాళ్లంత తినింది? అని ఆలోచించే కుందికి నా గుండె చెరువై పాయ. చెరువైనా బొరువైనా ఏం చెయ్యాల?

ఈ కలం కత్తైన్నా కావాల!

సిమింటురోడ్డు మింద పణ్ణె సమ్మిటి దెబ్బలు పడాల్సిన గుండెల మిందన్నా పడాల!!

ఒళ్లు పదిరె. మణుసు చెదిరె. కాళు కదిలె.

ఆయాళకాడ ముత్తారెడ్డన్న మణుసులో మెదిలె. ఆయన్న కనపడ్తే నా ఆలోచనకొక ముడి పడ్తింది. లేకుండాపోతే మణుసు సోదీనానికే రాదు. ఈపొద్దు యింత రేత్రికాడ యాడేడ తిరగాల్నో ఏం పాడో? ముత్తారెడ్డన్న పచ్చంగా తిని ఎచ్చంగా దుప్పిటి కప్పుకోని ముడుక్కోనుంటాడేమో? ఈయాళకాడ యీవానలో యీదిన పడేదానికి ఆయన్న కేమన్నా గాచ్చారమా? అనుకుంటా సరిగ్గా నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్యేకుందికి 'ఓరబ్బారే' అని పిల్సినట్టుంటే మండపంకల్లా చూసినా.

ముత్తారెడ్డన్న!

నన్ను చూస్తానే వచ్చి నా ఎదురుంగా నిలబడె. నేను మాత్రం రోడ్డువారా సిమింటు పైపులు కాలవలోకి దొల్లిస్తావుండే వాళ్లకల్లా చూస్తా ఉండా!

''అబ్బారే! నీ మాదిర రాసే వాళ్లంతా ఈ ప్రెబుత్వాలకు రుణపడి ఉండాల్లా!'' అనె. తేలమొకం ఏసుకోని ఆయన్న కల్లా చూస్తా ఉంటే-

''ఒరే! శిలిపి శిలపం చెక్కేదానికి రాయి కావాల. ఆడ రాయి ముడి సరుకు. అదే బొమ్మలు చెక్కాలంటే కొయ్యకావాల. ఈడ కొయ్య ముడిసరుకు. అట్టా మాదిర్నే రచయితలకు ముడి సరుకు కావాల్నా? కావాల. పరిశ్రమకు కావాల్సినంత ముడిసరుకు సప్లయ్ చెయ్యలేని ఈ ప్రెబుత్వం మీకు మాత్రం లోటు చెయ్యలా. ఈళ్లందుర్నీ యిట్నే పెట్టింది ఎందుకనుకున్నావ్? మీరు ముడిసరుగ్గా వాడుకుండే దానికి! ఇప్పుడు చెప్పు. మీరంతా ఈ ప్రెబుత్వానికి రుణపడి ఉండాల్నా? వస్లేదా?''

''ప్రెబుత్వానికి ఎట్టన్నా పోనీగానీ నీకు మాత్రం ఋణపడి ఉండాలన్నా!'' అంటా యింటికి తిరుక్కుంటి ముత్తారెడ్డన్న నవ్వు ఎంటపడి ఈపల్లో పొడస్తా ఉంటే! ●